క్లుప్తంగా

వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి



విద్యార్థులతో మాట్లాడుతున్న కిలగాడ వైద్యాధికారి శిరీష

ముంచంగిపుట్టు: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కిలగాడ వైద్యాధికారి శిరీష అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2లో ఆదివారం కిలగాడ వైద్య సిబ్బంది సందర్శించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ విద్యార్థులు వర్షకాలంలో వ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఆహార పదార్థాలను తినవద్దని, వేడి నీటిని తీసుకోవాలని సూచించారు. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని, వైద్య సేవలు పొందాలని ఆమె విద్యార్థులను కోరారు. హెచ్ఎం బి.శంకరరావు, వార్డెన్ బి.శ్రీనివాసరావు, సీహెచ్‌వో రోషిణి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

180 మందికి వైద్య పరీక్షలు



వంచంగి గ్రామంలో వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: మండలంలోని వంచంగి గ్రామంలో విశాఖపట్నానికి చెందిన మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 180 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్య నిపుణులు రోగులకు అన్ని విధాల పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు చేసి శస్త్రచికిత్సలు అవసరమైనట్టు 17 మందిని గుర్తించి వారిని ఆపరేషన్ కోసం విశాఖపట్నంలోని ఆస్పత్రికి తరలించినట్టు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ భాగ్యరాజ్ (జనరల్), డాక్టర్ శ్రావణ్‌కుమార్ (కార్డియాలజీ), డాక్టర్ ఎం.ఎస్.ఎన్.రాజు (ఆప్తమాలజీ) రోగులను పరీక్షించారు. మాజీ సర్పంచ్ సరస్వతి, సొసైటీ మాజీ అధ్యక్షుడు తాతారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీశ్వరస్వామి కల్యాణం

చోడవరం: రమణీయం..కమణీయం.. శ్రీ గౌరీశ్వరస్వామివారి కల్యాణం. గోవాడ గ్రామంలో అతి పురాతన శివాలయాల్లో ఒకటైన శ్రీ గౌరీశ్వరస్వామివారి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ గౌరీ సమేతుడైన ఈశ్వరుడికి వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య కల్యాణం ఎంతో వైభవంగా జరిగింది. స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా బంగారు ఆభరణాలతో అలంకరించి కల్యాణం జరిపించారు. గోవాడతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ కల్యాణోత్సవంలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ముమ్మరంగా ఆంజనేయస్వామి ఆలయ గోపురం పనులు



మాడుగులలో నిర్మాణమవుతున్న ఆలయ గోపురం

మాడుగుల: స్థానిక గాంధీ పార్కు వద్ద వెలసిన విజయాంజనేయ ఆలయ గోపురం పనులు పూర్తి కావస్తున్నాయి. ఆలయ మండప నిర్వాహకులు రాఖీ శ్రీనుతో పాటు ఇతర సభ్యులు గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ నిర్మాణం జరుగుతుంది. ఆలయ పైభాగంలో శ్రీరాముని పట్టాభిషేకం కూడా నిర్మాణం జరుగుతుందని, దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మునగపాక: ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని ఏఎస్ఐ దొర కోరారు. మెయిన్‌రోడ్డులో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్ఐ హెచ్చరించారు. వాహన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.



జడుగూరు గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి



గ్రామ సమీపంలోని గెడ్డ నుంచి నీరు సేకరిస్తున్న స్థానికులు



పాఠశాల భవనం లేక చెట్టు నీడలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

జడుగూరు.. సమస్యల ఊరు



జడుగూరు గ్రామం

- కనీస సౌకర్యాలు కరువు
- గ్రామానికి కాలిబాటే శరణ్యం
- ఆదివాసీలకు కలుషిత నీరే దిక్కు
- కానరాని పాఠశాల భవనం
- చెట్టునీడనే పాఠాల బోధన
- గ్రామాభివృద్ధిని పట్టించుకోని అధికారులు



గ్రామంలో పునాదులతో నిలిచిన పాఠశాల భవనం



సుదూరం నుంచి గెడ్డనీటిని తీసుకొస్తున్న మహిళలు

చింతపల్లి: దట్టమైన అటవీ ప్రాంతంలో నాలుగు కొండల నడుమ విసిరేసిన రాళ్లులా ఉండే ఆదివాసీ గ్రామాలు. నేటికీ కనీస సౌకర్యాలుకు నోచుకోని గ్రామాలన్నో...ఆ కోవలోకి వచ్చిందే మండలంలో గల జడుమూరు గ్రామం. కుడుముసారి పంచాయతీ పరిధిలో గల అతి మారుమూలన గల జడుగూరు గ్రామం ఏర్పడి దశాబ్దాలు కావస్తున్నా నేటికి కనీస సౌకర్యాలకు నోచుకోక స్థానిక ఆదీవాసీ గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పోడు వ్యవసాయమే ఆధారంగా 30 కుటుంబాలకు సంబంధించి 150 మంది ఆదివాసీలు జీవనాన్ని సాగిస్తున్నారు. గ్రామానికి కనీస మౌలిక సౌకార్యాలైన తాగునీరు, రహదారి, పక్కా ఇళ్లు , పాఠశాల వంటి అభివృద్ధి కార్యక్రమాలకు నోచుకోక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

కాలిబాటే శరణ్యం

గ్రామం ఏర్పడి దశాబ్దాలు కావస్తున్నా నేటికీ కొండల మధ్య నుండి ఈ గ్రామానికి చేరుకోవడానికి చిన్నపాటి కాలిబాటే శరణ్యంగా మారింది.ఒక వైపు తమ్మెంగులు పంచాయతీ పరిధిలో గల వర్తనాపల్లి గ్రామం మీదుగా ఒక దారి మీదుగా గ్రామం చేరడానికి అత్యంత ఎత్తైన కొండపై నుంచి 2 కిలోమీటర్లు రావల్సి ఉండగా, మరొక వైపు నుంచి కుడుముసారి పంచాయతీ తూరుబొంగులు, చింతలపాడు మీదుగా మరొక మార్గం గుండా కూడా కాలినడకన కొండల నడుమ గ్రామానికి అతి కష్టం మీద చేరుకోవాల్సిన ఉంది. గ్రామంలో ఎవరికి అనారోగ్యం సోకినా లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ,నిత్యావర వస్తువులు కావల్సివచ్చినా అన్నవరం వారపు సంతకు, మండల కేంద్రానికి రావాలంటే వర్తనాపల్లి గ్రామం వరకూ కాలినడకన కిలోమీటర్లు కొండదిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా పంచాయతీ కేంద్రానికి చేరాలన్నా చింతలపాడు, తూరుబొంగులు వరకూ కూడా అదే పరిస్థితి. ప్రస్తుతం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం తీసుకోవడానికి కూడా సుమారు అయిదు కిలోమీటర్లు దూరంలో ఉన్న నిమ్మపాడు డీఆర్ డిపోకి రావల్సిన వస్తోంది. ప్రభుత్వ గ్రామానికి పక్కా ఇళ్లు మంజూరు చేసినా ఇంటి నిర్మాణ సామగ్రిని తీసుకురావటానికి రహదారి సౌకర్యం లేక పోవడంతో కనీసం గృహాలకు నోచుకోలేక పోతున్నామని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేటికి ఆ గ్రామానికి కనీసం ఉపాధి హామి పథకం ద్వారా కూడా రహదారి ఏర్పాటుకు కూడా అదికారులు చర్యలు చేపట్టలేదని వారు వాపోతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ జడుగూరులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మౌలిక సదుపాయల కల్పనకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతామన్నారు.

ఊటగెడ్డ నీరే దిక్కు

జడుగూరులో ఎటువంటి తాగునీటి సౌకర్యం లేక పోవడంతో గ్రామానికి సమీపంలో గల కలుషిత ఊటగెడ్డ నీరే దిక్కుగా మారింది. ఎండైనా..వానైనా ఈ కలుషిత నీటినే వినియోగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. వర్షాకాలంలో ఈ ఊట గెడ్డనీరు పూర్తిగా కలుషితం కావడంతో అదే నీటిని తాగి అనేకమంది అనారోగ్యం పాలవుతున్నా విధిలేక ఆ నీటినే తాగాల్సిన దుస్థితి నెలకొందని కన్నీరుమున్నీరవుతున్నారు. కనీసం గ్రావిటీ పథకాన్ని ఏర్పాటు చేసే దిశగా కూడా అధికారులు ఎటువంటి కృషి చేయలేదని ఆరోపిస్తున్నారు.

చెట్టునీడన పాఠశాల

జడుగూరు గ్రామంలో పాఠశాల ప్రారంభం నుంచి నేటి వరకూ పాఠశాలకు పక్కా భవనం లేక పోవడంతో విద్యార్థులు చదువుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సౌకార్యార్థం గడిచిన ఐదేళ్ల క్రితం పాఠశాల నిర్మాణాన్ని ప్రారంభించి కాంట్రాక్టర్ పునాదిలతోనే నిలుపుదల చేశాడు. నాటి నుంచి నేటి వరకూ ఆ పునాదులు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. దీంతో నిలువనీడ లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండగా ఉన్న రోజుల్లో పునాదులు మధ్యలోనో లేక సమీపంలోని పెద్దచెట్టు నీడ కిందనో పాఠాలను బోధించాల్సి వస్తుంది. చిన్న చినుకు పడితే గ్రామంలో గల ఒక ఇంటి అరుగుపై తరగతులను చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో చిన్నారులు సైతం 15 నుండి 20 మంది వరకూ ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో అ పిల్లలు పోషకహారం కోసం రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న కరకపల్లి నుంచి కాలినడకన తెచ్చుకోవలసిన పరిస్థితి ఉందని స్థానిక ఆదివాసీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రహదారి నిర్మించాలి



జడుగూరు గ్రామానికి రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. గ్రామం ఏర్పడి దశాబ్దాలు కావస్తున్నా నేటికి రహదారి సౌకర్యం ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం అవుతుంది. ఏ ఒక్కరు అనారోగ్యం పాలైనా డోలి మోతలో కాలినడకన తీసుకురావలసిన పరిస్థితి. నిత్యావసర సరుకులతో పాటు పంచాయతీ,మండల కార్యాలయాలకు చేరుకోవాలన్నా గ్రామం నుంచి సుమారు 3 నుంచి 5 కిలో మీటర్లు కాలినడకన వెళ్లి పక్కా రోడ్డును చేరుకోవలసి వస్తుంది. అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యానికి చర్యలు చేపట్టాలి. – సుబ్బు, జడుగూరు గ్రామస్తుడు

తాగునీటి సౌకర్యం కల్పించండి



గ్రామంలో ఎటువంటి త్రాగు నీటి సౌకర్యం లేక పోవడంతో సమీపంలో గల కొండ ఊటగెడ్డ నీటినే ఆశ్రయించాల్సి వస్తుంది.ఆ కలుషత ఊట నీటినే వినియోగిస్తున్నాం. కలుషిత నీటి వినియోగంతో తరచూ గ్రామస్తులు వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వేధిస్తున్నాయి. ఇప్పటివరకూ గ్రామంలో ఏ మంచినీటి పథకం లేదు. అధికారులు స్పందంచి గ్రామానికి సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించాలి.
– చిన్ని, జడుగూరు గ్రామం

పాఠశాల భవనాన్ని పూర్తి చేయండి



పాఠశాల నిర్మాణాన్ని పునాదులలో నిలిపేసి ఐదేళ్ల కావస్తుంది. విద్యార్థులకు భవన సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. వాతావరణం బాగుంటే చెట్టు నీడన. చినుకు పడితే మా గ్రామంలో ఉన్న చిన్న ఇంటి అరుగుపైన తరగతులు సాగుతున్నాయి. అధికారుల పాఠశాల భవనాన్ని పూర్తికి చర్యలు తీసుకోవాలి. – గణేష్, గ్రామస్తుడు, జడుగూరు గ్రామం

అంతర పంటలపై రైతుల ఆసక్తి



కొమరవోలు గ్రామంలో జీడి తోటలో పెసరపంట సాగు చేసిన రైతు



రోలుగుంటలో పంట భూమిలో పండిన పెసరబోట్టలు సేకరిస్తున్న మహిళా రైతు

రోలుగుంట : మండలంలో పలు గామాల్లో గల రైతులు అంతర పంటలపై ఆసక్తి చూపుతున్నారు. కోమరవోలు గ్రామంలో జీడి తోటలో సుమారు 20 ఏకరాల మేర విస్తీర్ణంలో రైతులు పెసరపంట సాగు చేశారు. కొండపాలెం, రోలుగుంట, కొవ్వూరు తదితర గ్రామాల్లో జీడితోటలో సుమారు 210 ఎకరాల విస్తీర్ణంలో నువ్వు పంట సాగు చేశారు. అలాగే కె.నాయుడుపాలె, శరభవరం, బుచ్చింపేట, లగుడు కొత్తూరు, జానకీరాంపురం తదితర గ్రామాల్లో మినుములు, బొబ్బర తదితర స్వల్పకాలిక పంటలు సుమారు 180 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేపట్టారు. ఇలా రైతులకు అనుకూలమైన స్వల్పకాలిక పంటలు వేశారు. వీటికి దుక్కు, కలుపు మొక్కల తొలగించేందుకు గొప్పులు పనులు మినహా వర్షాలతో పని లేదు. పెసరలో ఆకు పచ్చపురుగు తెగులు సోకిన పంటల్లో వ్యవసాయాధికారి సూచనలతో పిచికారి చేసి నివారించుకున్నారు. ప్రస్తుతం కాయ దశలో ఉండడంతో రైతులు వీటిని సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇవి ఒక పంట పోయినా మరో పంట కలిసి వస్తుందని, పెద్దగా పెట్టుబడి కూడా అవసరంలేదని, పెట్టుబడులు పోను దిగుబడుల ఆధారంగా ఖర్చులకు బాగానే మిగులుతాయిని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా వాక మరిడమ్మ పండగ



మొక్కులు చెల్లించుకునేందుకు ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో ఆదివారం వాక మరిడమ్మ అమ్మవారి పండగను గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారులతో పాటు గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు. ప్రతి ఏడాది ఉపాధి వేతనదారులతో అమ్మవారి పండగను వీఆర్పీ అర్.వెంకటలక్ష్మి జరుపుతున్నారు. ఈ పండగను నిర్వహించుకోవడం ద్వారా ప్రజలకు, ఉపాధి వేతనదారులకు మంచి జరుగుతుందనే నమ్మకంతో ప్రతి ఏటా జరుపడాన్ని చేస్తున్నట్టు వీఆర్పీ తెలిపారు. గ్రామంలో గల సతకం పట్టు నుంచి ఊరేగింపుగా ప్రజలు, ఉపాధి వేతనదారులు అడ్డూరి కొండ వాగు సమీపంలో గల వాక మరిడమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, ఉపాధిహామీ మేట్‌లు పాల్గొన్నారు.

కె.జె.పురంలో నేత్రపర్వంగా ఒడ్డు పండగ



ఘటాల ఊరేగింపులో భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మోదమాంబ అమ్మవారికి ఆదివారం ఒడ్డు పండగ నిర్వహించారు. మోదమాంబ ఆటో వర్కర్సు యూనియన్ ఆధ్వర్యంలో, వర్కర్సు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఘటాలు నెత్తిన పెట్టుకుని గ్రామ పురవీధు ల్లో ఉరేగింపుగా వెళ్లి, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్సు సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకరంలో బంగారం చోరీ



పరిశీలిస్తున్న క్లూస్ టీం

అనకాపల్లి టౌన్: తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగిన సంఘటన మండలంలోని శంకరం గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ రవికుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో నివాసముంటున్న శరగడం ఆదినారాయణ ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో అనకాపల్లి వెళ్లారు. అనంతరం అదే రోజు తొమ్మిది గంటలకు తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఉన్న బ్యాగుల్లో సామాన్లు చిందరవందంగా ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారం చోరీ జరిగినట్టు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం క్లూస్ టీం సిబ్బంది వచ్చి పరిశీలించారు.

'యువత పోరు'కు తరలిరండి

- పాడేరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నేడు
- పార్టీ శ్రేణులు, యువత, నిరుద్యోగులు తరలిరావాలని నేతల పిలుపు







విలేకరులతో మాట్లాడుతున్న ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, జీకే వీధి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పాంగి పద్మారావు, పరశురామ్, గిరి ప్రసాద్

ముంచంగిపుట్టు: జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నిరుద్యోగులు, యువత, అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులు, యువత సంక్షేమం కోసం అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువతకు అన్ని విధాలుగా మోసం చేస్తుందన్నారు. యువతకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై అన్ని విధాలుగా ఒత్తిడి తెచ్చి హామీలు అమలు చేసే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాడేరులో సోమవారం చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు,అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డుంబ్రిగుడ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పాడేరులోని చేపట్టనున్న యువత పోరు కార్యక్రమనికి ప్రతి కార్యకర్త, యువత తప్పనిసరిగా హాజరు కావాలని మండల పార్టీ అధ్యక్షుడు పి.పరశురామ్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో పాడేరులో జరగనున్న కార్యక్రమంలో భారీ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టానున్నామని పార్టీ శ్రేణులు, యువత, నిరుద్యోగులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గూడెంకొత్తవీధి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పాడేరులో సోమవారం నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు చేసిన మోసాలపై ఆందోళన చేస్తున్నామన్నారు. పాడేరులో నిరసన ర్యాలీ అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొవాలని ఆయన కోరారు.

ప్రజాధనం దుర్వినియోగం

- యోగా డేతో ప్రయోజనం శూన్యం
- ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రమణ

దేవరాపల్లి : యోగా డే పేరిట కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేయడం అత్యంత దారుణమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ ఆవేదన వ్యక్తం చేశారు. దేవరాపల్లిలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్న పాలకులు ఇంత ప్రచార ఆర్భాటంగా యోగా డేను నిర్వహించడం వల్ల ప్రజలకు ఒరిగిందేమిటని ఆయన ప్రశ్నించారు. కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే, గిన్నిస్ బుక్ రికార్డుల కోసం కోట్లాది రూపాయాలు వెచ్చించడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలు వదిలి ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు యోగా డే ఏర్పాట్లలో నిమగ్నం కావడంతో సుమారు నెల రోజులుగా పాలన స్తంభించిపోయిందన్నారు. బస్సులు సైతం అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించారన్నారు. యోగా పట్ల సానుకూల దృక్పథం ఉంటే ప్రతి స్కూల్‌లో యోగా టీచర్‌ను నియమించి యోగా శిక్షణ ఇప్పించాలని రమణ సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ బిజ్జపల్లి గ్రామ సమీపంలోని హుకుంపేట మధ్య కామయ్యపేట ప్రధాన రహదారి వద్ద రెండు విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదస్థాయికి చేరుకున్నాయి. దీంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు, ఏ రోజు ఏ ప్రమాదం ముంచుకొస్తోందోనని భయపడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాలు రద్దీగా తిరుగుతున్నాయని, అసలే వర్షాకాలం సమీపిస్తుందని ఏ సమయానికి ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు గుర్తించి తక్షణమే నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని వారు కోరుతున్నారు.